# వార్డు మెంబర్ల ఫోరం జిల్లా అధ్యక్షులుగా గులాం జావిద్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** వార్డు మెంబర్ల ఫోరం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులుగా రాజంపేట గ్రామ పంచాయతీ 9వ వార్డు సభ్యులు గులాం జావిద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆసిఫాబాద్ పట్టణంలోని వాసవి భవన్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించిన ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్ల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా ఏకగ్రీవంగా గులాం జావిద్‌ను అధ్యక్ష పదవికి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు గులాం జావిద్ మాట్లా డుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన ప్రజాప్రతినిధులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవితో తనపై బాధ్యత మరింత పెరిగిందని ఆయన పేర్కొన్నారు. వార్డు మెంబర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, అందరినీ కలుపుకొని ఫోరం బలోపేతానికి, వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేష్ యాదవ్, కార్యదర్శి జంపన్న జానీ, కొమురం భీం జిల్లా ఇంచార్జి ముండే దీపక్ లతో పాటు జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులకు స్థల పరిశీలన



**ఉద్యమ కెరటం, హన్మకొండ:** బస్టాండ్ నుంచి దామరుప్పుల సదయ్య ఇంటి వరకు మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనుల కోసం సోమవారం స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు స్థల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గరిగె కల్పనా కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ బత్తిని రాజు, మాజీ సర్పంచ్ సదిరం పోషాలు, ఏఈ సమ్మిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మనోహర్తో కలిసి ప్రతిపాదిత రోడ్డు మార్గాన్ని పరిశీలించి నిర్మాణ పనులపై చర్చించారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు రాకపోకల సౌకర్యం మరింత మెరుగుపడు తుందని వారు తెలిపారు. అనంతరం పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిల్లా రమణారెడ్డి, వార్డు సభ్యులు వేల్పుల ప్రసాద్, మిరాలా రజిత రవి, దైనంపెల్లి రాజేంద్రప్రసాద్, దురిశెట్టి బిక్షపతి తదితరులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సెయింట్ గాబ్రియల్స్ స్కూల్లో అధిక ఫీజుల వసూళ్ల పై ఎంఈఓకు ఫిర్యాదు



**ఉద్యమ కెరటం, హన్మకొండ:** సెయింట్ గాబ్రియల్స్ హై స్కూల్ యాజమాన్యం విద్యార్థుల నుంచి అధిక ఫీజులు, యూనిఫాంలు, పుస్తకాల పేరుతో అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తోందని బీజేపీ నాయకులు ఎంఈఓ మనోజ్ఞకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం ఫీజుల నియంత్రణ నిబంధనలను ఉల్లంఘిస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతోందన్నారు. అలాగే స్కూల్ ప్రిన్సిపాల్ జోసెఫ్ అమల రాజన్ వ్యవహార శైలి పట్ల కూడా పలువురు తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించకపోవడం, తల్లి దండ్రులతో సరైన సమన్వయం లేకపోవడం, కొంత ఫీజు బకాయి ఉన్న కారణంగా విద్యార్థులను పాత తరగతి గదుల్లో కూర్చోబెట్టడం వంటి చర్యలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ అధ్యక్షుడు గంధసిరి శ్రీకాంత్, 63వ డివిజన్ అధ్యక్షుడు రేణికుంట్ల కళ్యాణ్ కుమార్, 47వ డివిజన్ ఉపాధ్యక్షుడు మద్దెల కార్తీక్, బూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా నాయకులు గొర్రె శ్రీనివాస్, వేణుగోపాల్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# కందుకూరులో ఉచిత వైద్య శిబిరం

- **న్యూ స్టార్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు, మందుల పంపిణీ**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూర్ మండలంలోని కందుకూరు గ్రామంలో సోమవారం న్యూ స్టార్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే వైద్యులు ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన పలు సూచనలు, సలహాలు అందజేశారు. శిబిరానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మందపాటి వెంకటరెడ్డి, ఉప సర్పంచ్ గొర్ల ప్రభాకర్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, హాస్పిటల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అచలాపూర్ విద్యార్థికి ట్రిపుల్ ఐటీలో సీటు



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని అచలాపూర్ జెడ్పీహెచ్ఎస్కు చెందిన విద్యార్థి చీర్ల హరిచరణ్ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి పాఠశాల, గ్రామానికి గర్వకారణంగా నిలిచాడని ప్రధానోపాధ్యాయురాలు పి.ఉమాదేవి తెలిపారు. మార్చి 2026లో నిర్వహించిన ఎస్ఎస్సీ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో తాండూర్ మండల స్థాయిలో రెండో స్థానం సాధించిన హరిచరణ్, తాజాగా విడుదలైన ట్రిపుల్ ఐటీ ప్రవేశ ఫలితాల్లో మహబూబ్నగర్ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. అచలాపూర్ ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందిన హరిచరణ్ను పాఠశాల ఏఏపీసీ చైర్మన్ చిలుకమ్మ, గ్రామ సర్పంచ్ మారిశెట్టి స్రవంతి శ్రీనివాస్, ఉప సర్పంచ్ గట్టు సంతోష్ కుమార్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. విద్యార్థి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయండి

## జిల్లా కలెక్టర్ కె హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణులతో కలిసి ఆమె అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితులు తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. వాంకిడి మండలం వెల్గి గ్రామానికి చెందిన జుగునాక బాది రావు పేదవాడైన తనకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. సిర్పూర్ మండల కేంద్రానికి చెందిన జువెల్ల హుస్సేన్ తనకు స్వాతంత్ర సమర యోధుడి ధ్రువపత్రం ఇప్పించాలని, కౌటాల మండలం వీర్దండి గ్రామ మాజీ సర్పంచ్ తన పదవీకాలంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే, కౌటాల మండలం మొగడ్ దగడ్ గ్రామానికి చెందిన ఎర్మ సుధాకర్ తనకు చెందిన ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టా భూమిలో సోలార్ కనెక్షన్ మంజూరు చేయాలని కోరారు. చింతల మానేపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన రౌతు విర్దు తన పట్టా భూమిలో ఇతర వ్యక్తులు బలవంతంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని దరఖాస్తు సమర్పించారు. లింగాపూర్ మండలం ఖిమనాయక్ తండాకు చెందిన తేజావత్ సంగీత తనకు ఆశ వర్కర్ పోస్టు ఇప్పించాలని, బెజ్జూరు మండలం సల్గుపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి లింగయ్య తాను తెలంగాణ ఉద్యమంలో పనిచేసినందున ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. ఆసిఫాబాద్ మండలం గోడవెల్లి గ్రామానికి చెందిన ఘాజిరెడ్డి కార్తీక్ తనకు దివ్యాంగుల పింఛను మంజూరు చేయాలని కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ.. ప్రజావాణి దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిర్దేశిత గడువులోగా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహించకుండా అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి సంబంధిత అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో భాగస్వాములు కావాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో ఈనెల 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో రాజకీయ పార్టీలు చురుగ్గా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరుకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారాన్ని ఇంటింటికీ వచ్చి అందిస్తారని కలెక్టర్ తెలిపారు. ఓటర్లు నింపిన ఫారాలను అధికారులు తిరిగి సేకరించి, ఆ వివరాలను నిర్ణీత యాప్‌లో నమోదు చేస్తారని వివరించారు. ఈ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులకు సహాయకులుగా వాలంటీర్లను నియమిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సమైక్య సంఘ నిర్వాహకులు, యువజన సంఘాల ప్రతినిధులు, కుల పెద్దలు భాగస్వాములు అవుతారని వివరించారు. తహసిల్దార్లు, సూపర్వైజర్లు, జిల్లా యంత్రాంగం ఈ సమగ్ర సవరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తుందని కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీలు ఈ ప్రక్రియను విజయవంతం చేయడానికి తమ బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాను వెంటనే జిల్లా యంత్రాంగానికి అందించాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఎస్సీ, బీసీ కళాశాల హాస్టళ్ల కు సొంత భవనాలు నిర్మించాలి

## డీవైఎఫ్ఐ వినతిపత్రం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, బీసీ కళాశాల హాస్టళ్లకు సొంత భవనాలు లేక విద్యార్థులు అద్దె భవనాల్లో , ఇరుకు గదుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మత్‌కు డీవైఎఫ్ఐ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నప్పటికీ, విద్యార్థుల హాస్టల్ భవనాల కోసం వాటిని కేటాయించకపోవడం సరికాదన్నారు. తక్షణమే ప్రభుత్వ స్థలాలను కేటాయించి, హాస్టల్ భవనాల నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బీసీ బాలికల కళాశాల హాస్టల్ భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరినప్పటికీ, కాంట్రాక్టర్ నిధులు లేవనే నెపంతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కిటికీలు, తాగునీటి సౌకర్యం, సున్నాలు వేసే పనులను మధ్యలోనే నిలిపివేశారని తెలిపారు. తక్షణమే మిగిలిన పనులను పూర్తి చేసి, ఈ విద్యా సంవత్సరంలోనే భవనాన్ని ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, జిల్లా నాయకురాలు లెండుగురే భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్ట్ పై దాడి అమానుషం

- **నిందితులను వెంటనే అరెస్ట్ చెయ్యాలి**
- **టియూడబ్లూ ్యజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి**



**ఉద్యమ కెరటం, నార్సింగి :** ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులకు గ్రామ పంచాయతీ నోటీసులు జారీ చేసిన వార్త రాసిన మన తెలంగాణ నార్సింగి విలేకరి రాఘవేంద్రపై సోమవారం నాడు జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టియుడబ్ల్యుజే ( ఐజేయూ ) జిల్లా అధ్యక్షులు శంకర్ చారి పేర్కొన్నారు. ఈ విషయమై సోమవారం నార్సింగి పోలీస్ స్టేషన్ లో యూనియన్ నాయకులతో కలిసి పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను హరిస్తూ నిజాలు నిగ్గు తేల్చిన జర్నలిస్టులపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో మంగళవారం నాడు జిల్లా వ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్, తహసిల్దార్ కార్యాలయాల్లో యూనియన్ తరపున ఫిర్యాదులు చేయాలని పిలుపునిచ్చారు. పోలీసులు కాలయాపన చేసి నిందితులను అరెస్టు చేయడంలో జాప్యం చేస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని తెలిపారు. వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిజి శ్రీనివాస్ శర్మ, ఐజేయూ సభ్యులు కే. శ్రీనివాస్ మిన్పూర్, జిల్లా నాయకులు సత్యనారాయణ, మల్లేశం, రమేష్ గౌడ్, భైరవరెడ్డి, యాదగిరి, మన తెలంగాణ జిల్లా ప్రతినిధి ఎస్. నర్సింహా చారి,అరుణ్, అనిల్,సలీం, రాచర్ల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ ఎస్టీ కమిషన్ సభ్యుడికి కలిసిన ఐటీడీఏ పీఓ

**ఉద్యమ కెరటం, ఉట్నూర్:** నేషనల్ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీఓ) మంద మకరంద్ సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన ఈ భేటీలో గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల మెరుగుదల, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ గిరిజనుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గిరిజన హక్కుల పరిరక్షణతో పాటు వారి సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి అవసరమైన చర్యలను క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన ప్రాజెక్టు అధికారికి సూచించారు. గిరిజన సంక్షేమం కోసం సంపూర్ణ సమన్వయంతో ముందుకు సాగాలని ఈ భేటీలో ఇరువురు అభిప్రాయపడ్డా రు.



# టెలాలు తొలగించవద్దు

- **చిరు వ్యాపారులకు ఆన్యాయం జరగనివ్వమని హామీ**

**ఉద్యమ కెరటం, అసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ఆనుకొని ఉన్న ఇరువైపుల టెలాలు తొలగించవద్దని చిరు వ్యాపారులు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఆకాష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, కమిషనర్ అంజయ్య, కౌన్సిలర్లకు విన్నవించారు. తమ పైన కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని తమ మున్సిపల్ కు టాక్స్ లు కడుతూ, ఆ టేలలపైనే అనేక సంవత్సరాల నుండి జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. డ్రైనేజీ రోజువారీగా శుభ్రం చేసుకుంటూ ఇబ్బందులు రాకుండా తమ చూసుకుంటామని చిరు వ్యాపారులు తెలిపారు. టేలాలు తొలగిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని విన్నవించడంతో సానుకూలంగా స్పందించిన మున్సిపల్ పాలకవర్గం చిరు వ్యాపారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు , సాలం బిన్ అహ్మద్, బాలకృష్ణ, బీ ఆర్ ఎస్ నాయకులు సాయి శ్రావణ్, దూడల అశోక్, చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడారంగ అభివృద్ధికి ప్రతిపాదనలు సమర్పించాలి

- **స్పోర్ట్స్ వైస్ చైర్మన్ సోనీ బాలదేవి**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ప్రభుత్వం విద్యారంగంతో పాటు క్రీడారంగ అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తుందని, ఈ క్రమంలో జిల్లాలో క్రీడా మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ఏర్పాట్ల కు సంబంధించి ప్రతిపాదనలు సమర్పించాలని తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలదేవి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పర్యటనలో భాగంగా ఆమె జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో గల క్రీడా మైదానాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడారంగాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా జనకాపూర్ క్రీడా మైదానంలో 400 మీటర్ల వాకింగ్ ట్రాక్, వాలీబాల్, ఫుట్‌బాల్ కోర్టుల ఏర్పాటుతో పాటు మైదానం ప్రహరీ గోడ నిర్మాణం, ఇతర అభివృద్ధి, మరమ్మతు పనులకు సంబంధించిన ప్రతిపాదనలను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులకు సూచించారు.అనంతరం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల క్రీడా పాఠశాలను ఆమె సందర్శించారు. అక్కడ అందుతున్న వసతులను పరిశీలించి, పి.డి., పి.ఈ.టి.లు, శిక్షకులతో మాట్లాడారు. గ్రామీణ, గిరిజన ప్రాంత విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా వారికి క్రీడలలో అత్యుత్తమ తర్ఫీదును అందించాలని పిలుపునిచ్చారు. ఇటీవల నిర్వహించిన ముఖ్యమంత్రి కప్ క్రీడా పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడాకారిణులను, వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన పి.డి. పి.ఈ.టి.లను ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి, వివిధ శాఖల సంబంధిత అధికారులు, క్రీడా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్ల సాధనకు ఉప సర్పంచ్‌ల 'ఛలో హైదరాబాద్'

- **గోడ ప్రతులను ఆవిష్కరించిన నాయకులు**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉప సర్పంచ్‌ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఉప సర్పంచ్‌లు ఈ నేల 25 తేదిన "ఛలో హైదరాబాద్" కార్యక్రమానికి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని స్థానిక వాసవి భవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేష్ యాదవ్, కార్యదర్శి జంపన్న జానీ ముఖ్య అతిథులుగా పాల్గొని, కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌పై వస్తున్న వార్తలను ప్రభుత్వం వెంటనే ఖండించాలని, ఉప సర్పంచులకు రూ. 5 వేలు, వార్డు సభ్యులకు రూ. 3 వేలు గౌరవ వేతనం చెల్లించడంతో పాటు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే వారి విధులు, అధికారాలను స్పష్టంగా నిర్వచించాలని, గ్రామపంచాయతీ పాలనలో తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నప్పటికీ తమకు సరైన గుర్తింపు, సౌకర్యాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను సానుకూలంగా పరిష్కరించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ఉప సర్పంచ్‌లు హైదరాబాద్‌కు తరలివెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. "ఛలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని మండలాలు, గ్రామాల ఉప సర్పంచ్‌లు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉప సర్పంచుల సంఘం జిల్లా ఇంచార్జి దీపక్ ముండే, ఉప సర్పంచులు చిట్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక రంగంలో గ్రామీణ విద్యార్థులు ముందంజలో ఉండాలి

- **మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాశ్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్**





**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఇంపాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ) , కాన్వా కోర్సులో ఆసిఫాబాద్‌కు చెందిన విద్యార్థిని సాంగ్డే మీనాక్షి ప్రథమ స్థానం సాధించింది. కోర్సులోని అన్ని అసైన్‌మెంట్లు, పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసి ఈ ఘనత సాధించిన మీనాక్షిని సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు ప్రథమ బహుమతి అందజేసి, ఆమె తల్లి దండ్రులు సాంగ్డే జీవన్, రమాదేవిలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాశ్, వైస్ చైర్మన్ అహ్మద్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సాంకేతిక రంగంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ముందంజలో ఉండాలని, ఏఐ లాంటి ఆధునిక రంగాల్లో మీనాక్షి ప్రతిభ కనబరచడం ఆసిఫాబాద్‌కే గర్వకారణమని ప్రశంసించారు. పేదరికం అడ్డంకి కాదని, ఆలోచన మార్చుకుంటే జీవితం మారుతుందని, ప్రతి విద్యార్థి మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండా శ్యామ్, తానుకు సాయి శ్రవణ్, వెంకటేష్ఇంపాక్ట్ క్లబ్ అధ్యక్షురాలు కుడ్మేత చెంచులక్షి తదితరులు పాల్గొన్నారు.

# కుంచపర్తి గ్రామంలో గుప్తనిధుల తవ్వకాల కలకలం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండలంలోని కుంచపర్తి గ్రామంలో గుప్తనిధుల తవ్వకాల వ్యవహారం కలకలం రేపింది. గ్రామంలోని మారెమ్మ తల్లి ఆలయం, శివాలయ ప్రాంగణంలో అర్ధరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు శనివారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించి ఘటనను వెలుగులోకి తీసుకొచ్చారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గత ఐదు రోజులుగా ఆలయ పరిసరాల్లో రహస్యంగా తవ్వకాలు కొనసాగుతున్నాయి. పక్కా సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు తనిఖీలు నిర్వహించగా, గుంటూరు, ఎన్కూరు ప్రాంతాలకు చెందిన 11 మంది కూలీలు అక్కడ ఉన్నట్లు గుర్తించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో తాము గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టేందుకు వచ్చినట్లు కూలీలు తెలిపినట్లు సమాచారం. దీంతో ఈ ఘటన వేంసూరు మండలంలో చర్చనీయాంశంగా మారింది. అయితే ఆలయ పూజారి స్వామీజీని పోలీసులు విచారించగా, ఆలయ పరిసరాల్లో యంత్రాల ప్రతిష్ఠాపన కోసం మాత్రమే తవ్వకాలు చేపట్టినట్లు ఆయన వివరణ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో గుప్తనిధుల తవ్వకాలా, లేక ఆలయ అభివృద్ధి పనులా అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఘటన స్థలం నుంచి 11 ద్విచక్ర వాహనాలు, 6 సెల్ఫోన్ల ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుప్తనిధుల తవ్వకా, లేనియెడల ఆలయ అభివృద్ధి పనులా అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# జిల్లా కాంగ్రెస్ పార్టీలో ప్రత్యేక వికలాంగుల విభాగం ఏర్పాటు చేయాలి


- **డీసీసీ అధ్యక్షుడికి హ్యాండీక్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ వినతి**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా కాంగ్రెస్ పార్టీ లో వికలాంగుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఒక వికలాంగుల విభాగాన్నిఏర్పాటు చేయాలని హ్యాండీక్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కోరారు. డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ను జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు డీసీసీ అధ్యక్షుడిని శాలువాతో సత్కరించి వినతిపత్రం అందజేశారు. అనంతరం సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా వికలాంగుల విభాగం ఏర్పాటు చేయాలని, ఈ విభాగం ద్వారా వికలాంగుల సమస్యలను పార్టీ, ప్రభుత్వ దృష్టి కి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వికలాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని తెలిపారు. జిల్లాలో వికలాంగుల విభాగం ఏర్పాటు అంశాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ చైర్మన్ సయ్యద్ షాహిద్ అలీ, హ్యాండీక్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు మహమ్మద్ ఇమ్రాన్, ఫైసల్ అహ్మద్, తార ఊషన్న, సయ్యద్ సజ్జద్, షేక్ మహబూబ్, షేక్ షాకీర్, ఎండీ మోసీన్, సాజిద్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి

- **ఇచ్చో డ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నారాయణరెడ్డి**



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఇచ్చోడ మండల అధ్యక్షుడు కళ్లేం నారాయణరెడ్డి అన్నారు. ఇచ్చోడ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన కళ్లేం నారాయణరెడ్డి పార్టీ అధిష్టా నానికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రెండోసారి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్, బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ తన ఎదుగుదలకు, విజయానికి నిరంతరం సహకరిస్తూ అండగా నిలిచిన ఇచ్చోడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టు కుంటూ బాధ్యతాయుతంగా పనిచేస్తానన్నారు. మండలంలోని ప్రతి నాయకుడు, కార్యకర్తను కలుపుకొని కాంగ్రెస్ పార్టీ ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శాయశక్తులా పనిచేస్తానని పేర్కొన్నారు.

# ఇచ్చో డ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా కళ్లెం నారాయణరెడ్డి



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** ఇచ్చోడ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కళ్లెం నారాయణ రెడ్డికి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ చైర్మన్ మహమ్మద్ ముస్తఫా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ కళ్లెం నారాయణరెడ్డి నాయకత్వంలో ఇచ్చోడ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన సమర్థవంతంగా పనిచేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఆయన ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, సద్దాం, పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శివాలయంలో డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ ప్రత్యేక పూజలు



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ మండల కేంద్రంలోని పురాతన శివాలయంలో ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించిన ఆయన స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేసి జిల్లా ప్రజల సంక్షేమం కోసం పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలంతా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. సకాలంలో వర్షాలు కురిసి రైతుల పంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని పరమశివుడిని కోరినట్లు తెలిపారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధి, ప్రజల ఐశ్వర్యం, రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక అభిషేకం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగ్నాథ్ అప్ప, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, కాంగ్రెస్ నాయకుడు రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్ పట్టణంలో విద్యుత్ ఎప్పుడు వస్తుంది..?

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ పట్టణంలో కొనసాగుతున్న విద్యుత్ అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, బ్యాంకులు, ఆన్లైన్ సేవా కేంద్రాలు, ఆసుపత్రులు, ఇతర కమర్షియల్ వినియోగదారుల పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కంప్యూటర్ ఆధారిత సేవలు దెబ్బతిన్నాయి. వ్యాపార కార్యకలాపాలు మందగించగా, ప్రజలు కూడా తమ రోజువారీ పనులు నిర్వహించడంలో ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు సమస్యకు గల కారణాలను వెల్లడించి, విద్యుత్ సరఫరా ఎప్పటికి పునరుద్ధరించబడుతుందో స్పష్టత ఇవ్వాలని వినియోగదారులు కోరుతున్నారు. పట్టణ ప్రజలు, వ్యాపార వర్గాలు, వివిధ కార్యాలయాల సిబ్బంది విద్యుత్ సరఫరా త్వరిత గతిన పునరుద్ధరించాలని కోరుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి, పరిస్థితిపై అధికారిక ప్రకటన విడుదల చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తడి - పొడి చెత్త వేర్వేరుగా అందజేయాలి

## గోపాల్ నగర్ సర్పంచ్ గాట్ల నర్సయ్య



**ఉద్యమ కెరటం, తాండూర్:** గ్రామాల్లో స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఇళ్ల లో ఉత్పత్తి అయ్యే తడి, పొడి చెత్త, సానిటరీ చెత్తతో పాటు హానికర వ్యర్థాలను వేర్వేరుగా వర్గీకరించి గ్రామపంచాయతీ ట్రాక్టర్కు అందించాలని గోపాల్ నగర్ సర్పంచ్ గాట్ల నర్సయ్య సూచించారు. సోమవారం తాండూర్ మండలంలోని గోపాల్ నగర్ గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు చెత్త నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను వర్గీకరించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు గ్రామస్థుల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. తడి, పొడి చెత్త, సానిటరీ వ్యర్థాలు, హానికర వ్యర్థాలను ఏయే కంపోస్ట్ పిట్స్లో వేయాలో ప్రజలకు ప్రాక్టికల్గా వివరించి సూచనలు అందించారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు ప్రజలు సిబ్బందికి సహకరించి, వేరు చేసిన చెత్తను మాత్రమే అందించాలని కోరారు. స్వచ్ఛమైన గ్రామ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సౌందర్య, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నేటి నుంచి రైతు వేదికల్లో విత్తన మేళా



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని కిష్టంపేట, కొత్తపల్లి , రేచిని రైతు వేదికల్లో విత్తన డీలర్లు, విత్తన కంపెనీల నిర్వహకుల ఆధ్వర్యంలో విత్తన మేళా మంగళవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్లు తాండూర్ మండల వ్యవసాయాధికారి కె.సుష్మ ఒక ప్రకటనలో తెలిపారు. విత్తన మేళాలో విత్తన డీలర్లు, విత్తన కంపెనీలు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి వివిధ రకాల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. ఈ వానాకాలం సీజన్లో వరి సాగు చేసే రైతులు ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి విత్తనాలను మాత్రమే సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఆ రకాల ధాన్యాన్నే కొనుగోలు చేయడంతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ కూడా అందజేయడం జరుగుతుందని తెలిపారు. అదనంగా నానో యూరియా, నానో డీఏపీ ఎరువులు కూడా రైతులకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు వేదికలకు వచ్చే రైతులు తమ పట్టాదారు పాస్పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాలని సూచించారు.

## నేడు కాంగ్రెస్ బీఎల్ఏ-2లకు ప్రత్యేక శిక్షణ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన బీఎల్ఏ-2ల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక రైతు వేదికలో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి అడే గజేందర్ తెలిపారు. సోమవారం విలేక రులతో మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో బీఎల్ఏ-2ల పాత్ర కీలకమని, వారికి అవసరమైన అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. నేరడిగొండ మండల కాంగ్రెస్ పార్టీకి చెందిన బీఎల్ఏ-2లు అందరూ తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. అలాగే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలు, కోఆర్డినేటర్లు తమ పరిధిలోని బీఎల్ఏ-2లు కార్యక్రమానికి హాజరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ ద్వారా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించి, పార్టీ కార్యకర్తలు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## హనుమాన్ ఆలయం వద్ద షెడ్డు మంజూరు చేయాలి

**మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు గ్రామస్తుల వినతి**



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని పవర్గూడా గ్రామ పంచాయతీ పరిధిలోని పవర్గూడా–బి గ్రామంలో ఉన్న హనుమాన్ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం షెడ్డు మంజూరు చేయాలని కోరుతూ గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పవర్గూడా సర్పంచ్ తొడసం రాజేందర్, గ్రామ పటేల్ బాలేరావ్ మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులు ఎండ, వర్షాల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం ఆలయం వద్ద షెడ్డు నిర్మాణం అత్యవసరమని పేర్కొన్నారు. గ్రామస్తుల వినతిపై మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సానుకూలంగా స్పందించారు. ఆలయానికి వచ్చే భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని షెడ్డు మంజూరు చేయించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ బాలేరావ్, సర్పంచ్ తొడసం రాజేందర్, గెడం బిర్షావ్, కోవా ప్రకాష్, మడవి కృష్ణ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ నూతన భవన ప్రారంభోత్సవానికి ఆత్రం సుగుణకు ఆహ్వానం



**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కార్యాలయ భవనం, దుకాణ సముదాయాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 24న నిర్వహించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణకు సోమవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిలో భాగంగా నిర్మించిన నూతన భవనాలు రైతులు, వ్యాపారులకు మెరుగైన సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. మార్కెట్లో ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రావడం రైతులకు తమ వ్యవసాయ ఉత్పత్తుల విక్రయంలో మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్ మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మించిన కార్యాలయ భవనం, దుకాణ సముదాయాలు మార్కెట్ కార్యకలాపాల నిర్వహణకు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కిష్టారం గ్రామంలో కత్తిపోట్ల కలకలం

- వ్యభిచార గృహం నిర్వహణపై వివాదం
- ఇద్దరికి తీవ్ర గాయాలు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన కత్తిపోట్ల ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వ్యభిచార గృహం నిర్వహణపై గ్రామ పెద్దలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో చెలరేగిన వివాదం ఘర్షణకు దారితీసి, ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. స్థానికుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరువూరు మండలానికి చెందిన నాగమణి, హనుమంతరావు దంపతులు కిష్టారం గ్రామ శివారులోని ఓ ఇంటిలో వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దలు ఆదివారం అర్ధరాత్రి అక్కడికి వెళ్లి గ్రామ సమీపంలో ఇలాంటి కార్యకలాపాలు నిర్వహించడం సరికాదని, వెంటనే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని సూచించినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణకు దారితీసింది. ఘర్షణ సమయంలో కొబ్బరి బొండాలు నరికేందుకు ఉపయోగించే కత్తితో గ్రామ పెద్దలపై దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా, స్థానికులు వారిని అంబులెన్స్ ద్వారా వెంటనే సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హైవే పక్కన ఉన్న గుడిసె వద్ద ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. వ్యభిచారం జరుగుతోందనే అనుమానంతో అడ్డుకునేందుకు వెళ్లిన సమయంలో ఈ దాడి జరిగినట్లు కాలనీ వాసులు పేర్కొంటున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణలో వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

# రైతు చావును రాజకీయాలకు వాడుకుంటున్న కేటీఆర్

**డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రైతుల సమస్యలపై చిత్తశుద్ధి లేకుండా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతు ఆత్మ హత్యలను రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ విమర్శించారు. సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇటీవల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నియమించిన ఆదిలాబాద్ జిల్లా మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులకు సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా నియమి తులైన మండల, పట్టణ అధ్యక్షులు పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజల ఓటు హక్కును కాపాడే బాధ్యత నాయకులపై ఉందన్నారు. ఇటీవల సిరికొండ మండలం పొన్న గ్రామంలో రైతు ఆత్మహత్య ఘటన బాధాకరమని పేర్కొన్నారు. ఆ ఘటనను కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకుం టున్నారని ఆరోపించారు. రైతు కుటుంబాన్ని పరామర్శిం చేందుకు వచ్చినట్లు కాకుండా, రాజకీయ ప్రచారం కోసం వచ్చినట్లు ఆయన వ్యవహరించారని విమర్శించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులకు సరైన ప్రాధాన్యం ఇవ్వలేదని, ఆ ప్రభుత్వం రూ.349 కోట్ల విలువైన జొన్నలను మాత్రమే కొనుగోలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రెండేళ్లలోనే రూ.800 కోట్ల విలువైన జొన్నలను కొనుగోలు చేసి రైతులకు మద్దతుగా నిలిచిందని తెలిపారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 50వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ అమలు చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, గంద్రత్ సుజాత, అల్లూరి సంజీవరెడ్డి, సాజిద్ ఖాన్, కొడాల నారాయణ, దామోదర్ రెడ్డి, సుధాకర్ గౌడ్, మాధవ్ పటేల్, గాలి సంజయ్, దేవిదాస్ చారి, నూతన మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఎంపికైన ఆదిలాబాద్ జిల్లా మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులకు నియామక పత్రాల అందజేత కార్యక్రమం సోమవారం డీసీసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేసి, వారిచేత ప్రమాణ స్వీకారం చేయించి సన్మానించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రైతుల మరణాలను బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం దురదృష్టకరమని విమర్శించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.349 కోట్ల విలువైన జొన్నలను కొనుగోలు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల వ్యవధిలోనే రూ.800 కోట్ల విలువైన జొన్నలను కొనుగోలు చేసిందని పేర్కొన్నారు. అలాగే అధికారంలోకి వచ్చిన వెంటనే 50వేల ఉద్యోగాల భర్తీ, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించిందన్నారు. కొత్తగా నియమితులైన మండల, పట్టణ అధ్యక్షులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గంద్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, ఇచ్చోడ ఆత్మ కమిటీ చైర్మన్ కొడాల నారాయణ, మాజీ డిసిసిబి చైర్మన్ దామోదర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుధాకర్ గౌడ్, మాధవ్ పటేల్, జనరల్ సెక్రటరీలు గౌలి సంజయ్, దేవిదాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా రైతులకు తీపి కబురు

- మొక్కజొన్నకు రూ.11.22 కోట్లు, జొన్నకు రూ.83.46 కోట్ల విడుదల
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలోని రైతాంగానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా శుభవార్త అందించారు. ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసిన మొక్కజొన్న, జొన్న పంటలకు సంబంధించి పెండింగ్లో ఉన్న నిధులను విడుదల చేస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 3,819 మంది రైతుల నుంచి ప్రభుత్వం మద్దతు ధరతో 2.19 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. మొత్తం రూ.52.63 కోట్లుకాగా, ఇందులో మొదటి విడతగా రూ.31.08 కోట్లను 2,624 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన రూ.21.55 కోట్లలో భాగంగా రెండో విడతగా రూ.11.22 కోట్లు ప్రధాన కార్యాలయం నుంచి జిల్లాకు విడుదల య్యాయని పేర్కొన్నారు. మిగిలిన రూ.10.33 కోట్లు కూడా అతి త్వరలో విడుదల కానున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో 25,591 మంది రైతుల నుంచి రూ.270.59 కోట్ల విలువైన 7.31 లక్షల క్వింటాళ్ల జొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేసిందని, ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.83.46 కోట్లను విడుదల చేసినట్లు వివరించారు. మిగిలిన బకాయిలను కూడా దశలవారీగా త్వరలోనే చెల్లించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.తాజాగా విడుదలైన మొక్కజొన్న నిధులు రూ.11.22 కోట్లు, జొన్న నిధులు రూ.83.46 కోట్లు ఈనెల 22 నుంచే రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేఫ్ట్, ఆర్టీజీఎస్ ద్వారా నేరుగా జమ చేయడం ప్రారంభించినట్లు చెప్పారు. రైతులందరూ తమ బ్యాంకు ఖాతాలను పరిశీలించాలని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత కొనుగోలు కేంద్రాలు, మార్క్ఫెడ్ అధికా రులను సంప్రదించాలని సూచించారు.



# ప్రజావాణి అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వర్**

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్లో ఉంచకుండా అత్యంత ప్రాధాన్యతతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కా రానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, శాఖల వారీగా సమీక్షించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న అధికారులు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రజావాణిలో ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, పింఛన్లు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు, భూమి సంబంధిత సమస్యలపై అధిక సంఖ్యలో వినతులు అందినట్లు తెలిపారు. అర్జీలను వెంటనే సంబంధిత శాఖలకు పంపించి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి అర్హులైన వారికి న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ స్రవంతి, జెడ్పీ సీఈఓ భుక్య రవి, డీఆర్డీఏ పీడీ రవీందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

- నూతన జాతీయ విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలి
- ఏఐఎఫ్డీఎస్ జాతీయ కన్వీనర్ మేత్రి రాజశేఖర్




**ఉద్యమ కెరటం, హైదరాబాద్:** ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, నూతన జాతీయ విద్యా విధానంను వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్డీఎస్) జాతీయ కన్వీనర్ మేత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. అలాగే నీట్ పేపర్ లీకేజీలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్లోని ఓంకార్ భవన్లో జూన్ 21, 22 తేదీల్లో నిర్వహించిన ఏఐఎఫ్డీ ఎస్ తెలంగాణ రాష్ట్ర స్థాయి విద్యా-వైజ్ఞానిక శిక్షణ తరగతుల రెండో రోజు కార్యక్రమం సోమవారం ప్రిన్సిపాల్ వి.భారత్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం కాకుండా అలాగే కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ స్కూల్స్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమ ర్శించారు. ఖాళీగా ఉన్న ఉపా ధ్యాయులు, నాన్-టీచింగ్ సిబ్బంది, డీఈఓ, ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేసి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ద్వారా విద్యను కార్పొరేటీకరణ, కాషాయీకరణ దిశగా నడిపిస్తోందని ఆరోపించారు. పాఠ్య పుస్తకాల ద్వారా మతోన్మాదాన్ని ప్రోత్స హించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. నీట్ పరీక్షల నిర్వహణలో వరుసగా చోటుచేసుకుంటున్న పేపర్ లీకేజీలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తు న్నాయని అన్నారు. దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారానికి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల్లో అవినీతి, అక్రమాలు, పేపర్ లీకేజీలు పునరావృతమ వుతున్నప్పటికీ ఎన్డీఏ, కేంద్ర ప్రభుత్వం సరైన సంస్కరణలు తీసుకురావడం లేదని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి, రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, రాష్ట్ర సహాయ కార్యదర్శి జబ్బర్, కోశాధికారి పోతుగంటి కాశి, రాష్ట్ర కమిటీ సభ్యులు టికంటి కుమార్, మార్త నాగరాజు, సందీప్, నాయకులు బిందు, అక్షయ, హన్సిక, రాకేష్, రాజు, సమీర్, లోకేష్, గణేష్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు న్యాయం చేయాలి

- పీసీసీఎఫ్ సువర్ణకు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే కోవలక్ష్మి




**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్, కెరమెరి మండలాలకు చెందిన రైతులతో కలిసి ఎమ్మెల్యే కోవలక్ష్మి సోమవారం హైదరాబాద్లోని ఫారెస్ట్ భవన్లో ఫారెస్ట్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) డాక్టర్ సి.సువర్ణను కలిసి రైతుల సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ ఆయా మండలాలకు చెందిన వందలాది కుటుంబాలు గత 50 సంవత్సరాలుగా అటవీ ప్రాంతాల్లో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. వ్యవసాయమే వారి ప్రధాన జీవనాధారం కాగా, ఇతర ఉపాధి అవకాశాలు లేక పోవడంతో కుటుంబాలు పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు. అటవీ శాఖ చర్యలతో రైతులు సాగు చేస్తున్న భూములను కోల్పోతే వందలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని జీవనోపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిగణ నలోకి తీసుకుని వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ ఏడాది ఇప్పటికే విత్తనాలు వేసి సాగు ప్రారంభించిన రైతుల పొలాలకు అటవీ శాఖ అధికారులు వెళ్లి ఇబ్బందులు కలి గించకుండా తగిన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెరమెరి, జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్ మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# జంగం గ్రామంలో బావి శుద్ధీకరణ కార్యక్రమం

- స్వచ్ఛమైన తాగునీటి కోసం గ్రామపంచాయతీ చర్యలు



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని జంగం గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బావి శుద్ధీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ సూచనల మేరకు బావిలో బ్లీచింగ్ పౌడర్ చల్లి నీటిని శుభ్రపరిచే చర్యలు చేపట్టారు.వర్షాకాలం నేపథ్యంలో నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు వినియోగించే తాగునీటి వనరులను పరిశుభ్రంగా ఉంచడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి వనరుల శుద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వర్షాకాలంలో నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను అరిక ట్టేందుకు బావుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామ ప్రజలు కూడా పరిశుభ్రత విషయంలో అప్రమత్తంగా ఉండి గ్రామపంచాయతీకి సహకరించాలని కోరారు. ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే గ్రామపంచాయతీ లక్ష్యమని అన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా బావుల శుద్ధీకరణ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తు న్నామని తెలిపారు. తాగునీటి వనరుల వద్ద పరిశుభ్రత పాటించి నీటి కాలుష్యాన్ని నివారించాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం గ్రామపంచాయతీ నిరంతరం చర్యలు చేపడుతోందని తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రజల సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

# మొహరం పండుగను ప్రశాంత వాతావరణంలో సామరస్యంతో జరుపుకోవాలి

**జిల్లా అదనపు కలెక్టర్ రాములు**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** మొహరం పండుగను మత సామరస్యంతో, ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. సోమవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మామిడి భగవాన్ రెడ్డితో కలిసి వివిధ మండలాల తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ముస్లిం మత పెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 26న జరగనున్న మొహరం పండుగకు సంబంధించి పీరీల నిర్వహణ, ఊరేగింపుల కోసం అన్ని శాఖల సమన్వయంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రార్థనల సమయంలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిర క్షణకు పోలీసు శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రార్థనా మందిరాలు, పీరీల ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అంతర్గత రహదారులపై సరిపడా లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక శాఖ సిబ్బంది అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని సూచించారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా జిల్లా పౌర సరఫరాల శాఖ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని పట్టుదలతో కృషి చేయాలి

- జర్మన్ భాషా శిక్షణను సద్వినియోగం చేసుకుని విదేశీ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి
- రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం పట్టుదలతో కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద సూచించారు. సోమవారం మందమర్రి పట్టణంలో ఏర్పాటు చేసిన జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణతో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టామ్కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న నేపథ్యంలో యువత జర్మన్ భాషను ఆసక్తిగా నేర్చుకో వాలని సూచించారు. ఉద్యోగాలు సాధించిన యువత తమ కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు సమాజానికి ఆదర్శంగా ఉండాలని అన్నారు. విదేశాల్లో స్థానిక చట్టాలు, నిబంధనలను గౌరవిస్తూ నైపుణ్యాలను మరింత పెంపొం దించుకోవాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ముఖ్యంగా జర్మనీలో నైపుణ్యం కలిగిన యువతకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. జర్మనీలో వారానికి 32 నుంచి 35 గంటల పని సమయం మాత్రమే ఉంటుందని, మిగిలిన సమయంలో వ్యక్తిగత నైపుణ్యాల అభివృద్ధికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధనతో పాటు ప్రతిరోజూ సాధన చేస్తే జర్మన్ భాషపై పట్టు సాధించి విదేశీ ఉద్యోగాలు పొందడం సాధ్యమవుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ శిక్షణార్థులు జర్మన్ భాషా శిక్షణను ఏకాగ్రతతో అభ్యసించాలని సూచించారు. కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకుని శిక్షణ పూర్తయ్యే నాటికి భాషపై పూర్తి అవగాహన సాధించాలని అన్నారు. విదేశీ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, శిక్షకులు, యువత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమంలో ప్రతి రంగాన్ని అభివృద్ధి చేస్తున్నాం

- సంక్షేమం, ఉపాధి, విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం
- రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందులో భాగంగా ప్రతి రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. సోమవారం జైపూర్ మండల కేంద్రంలో రూ.25 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న సామాజిక భవనానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎ. భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తదితరులతో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం భీమారం మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.66 లక్షల సమగ్ర శిక్ష నిధులతో నిర్మించిన అదనపు వసతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కొనుగోలు కేంద్రాల ద్వారా ఆఖరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వ్యవసాయానికి అవసరమైన యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని, రైతులు అపోహలను నమ్మకుండా అవసరమైన మేరకే యాప్ ద్వారా యూరియా కొనుగోలు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, రైతు భరోసా వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మందమర్రి ప్రాంతంలో జర్మన్ భాష శిక్షణ, ఇంజినీర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. త్వరలో కొత్త గని ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని, దీంతో సుమారు 5 వేల మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు మెరుగు పరుస్తూ నాణ్యమైన విద్య అందిస్తున్నామని చెప్పారు. చెన్నూర్, మందమర్రిలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు, సోమనపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చెన్నూర్లో నిర్మించిన వంద పడకల ఆసుపత్రిని జూలై 15న ప్రారం భించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మందమర్రిలో 50 పడకల ఆసుపత్రి పునఃప్రారంభానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతోందని, ఇప్పటికే దాదాపు 200 ఇళ్లు పూర్తికాగా, 8 వేల ఇళ్లు బేస్మెంట్ దశలో ఉన్నాయని తెలిపారు. రైతులకు అవసరమైన యూరియా సరఫరా, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి, పుస్తకాలు పంపిణీ చేశారు. చెన్నూర్ మండలం లింగంపల్లి, కోటపల్లి మండలం పారుపల్లి గ్రామాల్లో ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పారుపల్లి గ్రామంలో ఆలయ అభివృద్ధికి రూ.1లక్ష విరాళం ప్రకటిం చడంతో పాటు అంతర్గత రహదారులు, బోర్వెల్లు, హైమాస్ లైట్ల ఏర్పాటుకు నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతి నిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## చెన్నూర్లో పూర్తి స్థాయిలో రహదారుల అభివృద్ధికి చర్యలు

**అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి గడ్డం వివేకానంద**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** చెన్నూర్ పట్టణంలో అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేప డుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. సోమవారం జిల్లా పర్యటనలో భాగంగా చెన్నూర్ పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి రావిచెట్టు సెంటర్ వరకు జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులతో పాటు రావిచెట్టు సెంటర్ నుంచి చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో రహదారులు, మురుగు కాలువల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్య క్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చెన్నూర్ పట్టణంలోని చెరువు సమీపంలో ఉన్న ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవిష్యత్తులో జరగనున్న పుష్కరాల దృష్ట్యా ఆలయ పరిసరాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించి అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీలతో కలిసి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజావాణిలో వ్యాపార సమస్యలు, విద్య, విద్యుత్ కనెక్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూ రికార్డుల సవరణలు, ఆర్థిక సహాయం, అక్రమ తవ్వకాలు, చెరువుల ఆక్రమణలు తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ప్రతి అర్జీని సంబంధిత శాఖలు క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల మేరకు త్వరగా పరి ష్కరించాలని సూచించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 29, 30 తేదీల్లో ఇంటింటికి వెళ్లి ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1,836 మంది సిబ్బంది 459 పోలియో బూత్ల ద్వారా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని చెప్పారు. పోలియో వ్యాక్సిన్ పూర్తిగా సురక్షితమైందని, ప్రతి అర్హ బాలబాలికకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. వర్షాకాలంలో నీటి జనిత, కీటక జనిత వ్యాధుల వ్యాప్తి అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అన్ని శాఖల సమన్వయంతో సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాను పోలియో రహిత, ఆరోగ్యవంతమైన మంచిర్యాల జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

